**అద్దం తన బొమ్మకేకాదు, కోరికలకూ ప్రతిబింబం. అద్దంలో కనపడే తనను చూసుకోవాలనుకుంటే...అద్దమే కనపడకపోతే!**

రంగడీ రోజు చాలా ఆనందంగా వున్నాడు.

చేయవలసిన పనులన్నీ చకచకా చేయసాగాడు.

ఇదిగో, గేదెలకు గడ్డివేస్తే ఈ రోజుకు యింక పనిలేనట్టే!

గడ్డివాములోంచి గడ్డితీస్తూ, లోపలికి తొంగిచూశాడు.

"ఫర్లేదు. దొరగారు లోపల లేరు" అని మరోసారి అనుకున్నాడు. చేతులు తుడుచుకుంటూ నెమ్మదిగా, దొంగలా దొరగారి గదిలోకి తొంగి చూశాడు. ధైర్యంవొచ్చింది. గబగబా గదిలో కెళ్ళాడు!

ఇక్కడ వంటగదిలో ఆ యింటి దొర బాపినీడుగారు భార్యతో కబుర్లాడుతూ తృప్తిగా భోజనం చేస్తున్నారు.

రంగడు దొరగారి గదిలోకైతే వెళ్ళాడు గానీ, ఎవరైనా ఇటు వస్తున్నారేమోనని అనుమానంగా మళ్ళా తొంగి చూశాడు. వంట గదిలోంచి మాత్రం లీలగా నవ్వులు వినబడుతున్నాయి. అంతే!

ఎదురుగా వున్న టేబిల్ మీద బాపినీడుగారి మనీ 'పర్స్' వుంది. ఆ 'పర్స్' ప్రక్కనే లాంతరు వెలుగుతోంది. రంగడు టేబిల్ దగ్గరకెళ్ళి రెండు క్షణాలు ఆలోచనల్లో పడిపోయాడు.

లాంతరు పెద్దది చేసి చేత్తో పట్టుకుని ఆ గదంతా చూశాడు. చూసి, లాంతరు పట్టుకుని అద్దం దగ్గరకెళ్ళాడు. గోడకు ఒక ప్రక్కన పెద్ద అద్దం వ్రేలాడుతోంది.

ఆ అద్దంలో తన ముఖాన్ని చూసుకోవాలనే వెర్రికోరిక రంగడికి....లాంతరుని ఎత్తి పట్టుకుని, అద్దానికి దగ్గరగా జరిగి అందులో ముఖం చూసుకున్నాడు.

రంగడి ముఖం రంగడికే ఆశ్చర్యమేసింది!

"అబ్బో! నేను చాలా అందంగా వున్నాను" అని అనుకున్నాడు.

అద్దంలో తలని అడ్డంగా, ప్రక్కకీ, అటూ,యిటూ తిప్పుకుని చూసుకున్నాడు. నవ్వుకున్నాడు. కళ్ళు యెగరేశాడు. జుట్టు సవరించుకున్నాడు. నొసలు చిట్లించుకున్నాడు. ఎలా చూసుకున్నాతను అందంగానే వున్నాననుకున్నాడు.

రంగడు మళ్ళా మళ్ళా అద్దంలో తన ముఖాన్ని చూసుకోవాలనుకున్నాడు. కానీ అంతలో బాపినీడుగారు వస్తున్నట్టుగా అనిపించి రంగడు గబగబా బయటకొచ్చేసి నుంచున్నాడు.

"ఏరా రంగా! పనులన్నీ అయిపోయాయా?" వంటగదిలోంచి వస్తూ అడిగారు బాపినీడుగారు.

"అయిపోయాయి దొరా!"

"మరింక యిక్కడే నుంచున్నావేరా? వెళ్ళి భోజనం చెయ్. అమ్మగారు వంటింట్లోనే వున్నారు. వెళ్ళు....వెళ్ళి భోజనం చెయ్."

"అలాగే దొరా" అంటూ రంగడు వంట గదివేపు వెళ్ళాడు.

* * *

రంగడు యింటిముందు ఆకాశంక్రింద పడుకున్నాడేగానీ వాడికినిద్రరావడంలేదు.

ఇంతక్రితం కామందుగారింట్లో అద్దంలో తను చూసుకున్న తన ముఖమే పదే పదే గుర్తుకురాసాగింది.

ఎన్నో రోజులనుంచీ అద్దంలో తన ముఖాన్ని చూసుకోవాలని మహా యిదైపోయాడు రంగడు.

తనింట్లో అద్దం లేదు!

మూడేళ్ళక్రితం నట్టింట్లో వున్న తాటిపట్టీకి అద్దం వ్రేలాడుతూ వుండేది.

కానీ, ఇప్పుడక్కడ అద్దం లేదు!

అమ్మ చనిపోవడంతో అద్దమూ పగిలిపోయింది!

అప్పటికి రంగడికి పదేళ్ళుంటాయి.


నల్లగా, బొద్దుగా, బారుగా వుండేవాడు.

గవ్వల్లా కళ్ళు, నిర్లక్ష్యంగా మొహం మీద పడుతున్న జుట్టు.

రంగడు నల్లగా వున్నా-వాడి మొహంలో గొప్ప ఆకర్షణ వుండేది.చుట్టు ప్రక్కల ఆడవాళ్ళందరూ మహాప్రేమగా రంగడ్ని ముద్దులాడేవారు. ముద్దులాడ్డమే కాదు, పెద్దయిన తర్వాత వీడెంత అందంగా వుంటాడోకూడావూహించేవారు.

తల్లి వీరమ్మ. రంగడ్ని చూసుకుని మహా ఆనందపడిపోతూ వుండేది.

రెండు పూటలా వేడినీళ్ళతో స్నానం చేయించేది. తలకి నూనె రాసి, ముఖానికి పౌడరు రాసి, అద్దం తీసుకొచ్చి చూపిం[illegible]



ఆ అద్దంలో రంగడు— తనో చిన్న కృష్ణుడయినట్టు, బుల్లి హీరోలా వున్నట్టు ఏవిశేషమిటో వూహించుకునేవాడు.

ప్రతి రోజూ రంగడ్ని పొలానికి తీసు కెళ్ళడానికి సిద్ధంగా వుండే తండ్రి.



# కనపడని అద్దం

నందం రామారావు

ప్రొద్దుటే రంగడు అద్దం ముందు కూర్చుని ఆటలాడుతూ వుండడం చూసి విసుక్కునేవాడు.

ఓరోజు రంగడు ఏ ఆలోచనల్లో వున్నాడో ఏమో తండ్రిమాట వినిపించుకోలేదు. దాంతో తండ్రికోపమొచ్చి— "ఏందిరా కొడకా. మాట వినిపించుకోవ్" అంటూ రంగడి రెక్కపట్టుకుని బరబరా యివతలకు యీడ్చాడు.

అక్కడే అంట్లు తోముతున్న వీరమ్మ ఇది చూసి కాళిలా మొగుడిమీద విరుచుకు పడింది.

"ఏందయ్యోయ్. పిల్లాడ్ని గట్లా కొట్టి నావ్! నువ్వు మడిసివేనా?"

"ఊ. నేకపోతే పొద్దున్నే ఆఆటలేటి.. ఊఁ పదరా పొలంలోకి."

"ఆడు రాడయ్యా. ఆడికి ఎంతవయసొచ్చినాదని నువ్వు ఆడ్నితీసుకెడుతున్నావ్"

"ఒరేయ్ రంగా! నువ్వొత్తావా రావా?" అంటూ కోపంగా రంగడి దగ్గరకెళ్ళి, వాడి చేతిలోవున్న అద్దాన్ని విసురుగా విసిరేసి, ఎడాపెడా రంగడ్ని కొట్టేశాడు.

ఆ చెంప దెబ్బలకు రంగడు ఏడవలేక దూరంగా పడిన అద్దంకేసి చూస్తూండిపోయాడు.

రంగడి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

పదేళ్ళ ఆ పసి హృదయంలో తండ్రి మీద విపరీతమైన కోపం వచ్చింది.

నోటమాట రావడంలేదు.

రంగడు నెమ్మదిగా వొంగుని నేలమీద చెల్లాచెదురుగా పడున్న అద్దం ముక్కల్ని ఏరుకోసాగాడు.

*　*　*

కొడుక్కి ఇష్టమైన అద్దం కొనిపెట్టకుండానే చనిపోయింది.

తూర్పున వెలుగురేఖలు ఇంకా విచ్చుకోక మునుపే తల్లి పక్కలో పడుకున్న రంగడు మెలుకువ రావడంతో లేచాడు.

ఎప్పుడూ తొందరగాలేచి పనులు చూసుకునే తల్లి లేవకపోవడంతో రంగడు ఆశ్చర్యపోయి లేపాడు.

ఆ తల్లి వులకలేదు, పలకలేదు.

తల్లిని అనేకసార్లు భుజం పట్టుకుని కుదిపి మరీ పిలిచాడు.

అయినా ఆ తల్లి పలకలేదు!

మల్లన్న వచ్చి చూస్తే ఏం వుంది!

వీరమ్మ చనిపోయి వుంది!

అంతే!

ఆ రోజునుంచీ ఈరోజువరకూ రంగడి ఇంట్లో అద్దం లేదు! మల్లన్న ప్రొద్దుట లేవడంతోనే, నిద్రనించి లేచినవాడు లేచి నట్టే పొలం వెళ్ళిపోయేవాడు. ఆ తర్వాత నిదానంగా రంగడు ఇంటిపనులన్నీ చూసుకుని, తండ్రికి సహాయంగా పొలం వెళ్ళేవాడు.

అక్కడికీ చల్ది అన్నం కామందు బాపినీడుగారే పెట్టించేవారు!

*　*　*

ఇప్పుడు రంగడి వయస్సు పన్నెండేళ్ళు.

అయినా అద్దంలో తన ముఖాన్ని చూసుకోవాలనే వెర్రి కోరిక వాడికి తగ్గలేదు!

అక్కడికీ ఓ రోజు తండ్రితో—

"అయ్యా! మనింట్లో అద్దం నేదు. ఓ నాలుగు రూపాయలియ్యవే. మంచి అద్దం కొనుక్కొత్తాను!" అన్నాడు.

"ఏందిరా. ఇంకా నీకా అద్దం పిచ్చిపోలేదా? అది నేకపోతే ఏమైందిరా?"

ఈ మాటకి రంగడు, తండ్రికి చాలా చెప్పాలనుకున్నాడు. చెప్పినా ప్రయోజనం లేదని తెలుసు. అందుకే, ఏం మాట్లాడకుండా అక్కడనుంచి వచ్చేశాడు!

వొచ్చేశాడన్న మాటేగానీ, ఎలాగైనా సరే అద్దం కొనాలనుకున్నాడు.

ఆ రోజునుంచీ రంగడు తండ్రికి సాయంగా వుంటే కొనుక్కోవడానికి యిస్తున్న ఐదు పైసలు, పది పైసలు కామందుగారి భార్య సుభద్ర దగ్గర దాచుకోవడం మొదలుపెట్టాడు.

ఓ రోజు వుండబట్టలేక సుభద్ర అడగనే అడిగింది.

"ఏరా రంగా! పదిపైసలూ, ఐదు పైసలూ దాచుకుంటున్నావు గదా, ఈ డబ్బులేం చేస్తావురా?"

రంగడు నవ్వి వూరుకున్నాడు.

"ఏం జేస్తావని అడుగుతుంటే నవ్వుతావేరా?"

"అద్దం కొనుక్కుంటా నమ్మగారూ!"

అన్నాడు రంగడు.

సుభద్ర ఆశ్చర్యపోతూ "అద్దమా?" అన్నది.

"అవునమ్మగారూ. అద్దమంటే నాకు చానా ఇష్టమండి. మా ఇంటో అద్దం నేదండి."

"అందుకు దాస్తున్నావన్నమాట. బావుం దిరా. మరెప్పుడు కొంటావ్?"

"ఇంకో వారం రోజుల్లో సంబరాలొత్తున్నాయిగదండి. ఆడ కొంటాను."




గ్యాస్ కొరతవల్ల ఇప్పుడు
ఇబ్బంది పడనక్కరలేదు

JOHNSON

కాయిల్ స్టవ్ వాడండి
అది నిరపాయకరం

సోనో విజన్, ఏలూరు రోడ్డు, విజయవాడ-2.



ఈ నెల ఆణిముత్యాలు

ఈ నెల ఆణిముత్యాలు సచిత్ర మాసపత్రిక
కథ, కవితల పోటీకి రచయిత(త్రు)ల నుండి
రచనలను ఆహ్వానిస్తోంది

| | కథలు | కవితలు |
|---|---|---|
| మొదటి బహుమతి | రు. 150 | 20 |
| రెండవ బహుమతి | రు. 100 | 15 |
| మూడవ బహుమతి | రు. 75 | 10 |

నిబంధనలు :

1. కథ తెలుగు జీవితానికి సంబంధించినదై వుండాలి.
2. ఆరు పేజీలకు మించరాదు.
3. మినీకవితలకు ప్రాధాన్యత యివ్వబడును.
4. పోటీకి పంపిన కథలు త్రిప్పి పంపబడవు.
5. కవరుపై 'సెప్టెంబరు నెల పోటీకి' అని రాయాలి.
6. బహుమతుల విషయంలో సంపాదకునిదే తుది నిర్ణయం.
7. రచనలు : 15-7-81 తేదీలోగా

ఎడిటర్,

ఈ నెల ఆణిముత్యాలు, చిత్తూరు నార్త్,

చిత్తూరు-517 004.


"మరి డబ్బులు సరిపోతాయా?"

అమ్మగారి దగ్గరనుంచి ఆ మాట వినడంతోనే రంగడు బిక్కముఖం వేశాడు.

అవును! డబ్బులు సరిపోకపోతే ఎలా?

"ఒరేయ్ రంగా! ఇప్పటికి నువ్వు దాచుకుంది రెండు రూపాయల అరవై ఐదు పైసలు. నువ్వు సంబరాలకు వెళ్ళేటప్పుడు మొత్తం ఐదు రూపాయలిస్తాను. నీక్కావలసింది కొనుక్కో." అని అంది.

ఈ మాట అంటున్నది సాక్షాత్తూ తన తల్లే అనిపించింది.

* * *

పెదనలో పైడమ్మ గ్రామదేవత సంబరాలు మొదలయ్యాయని విని రంగడు మహా ఆనందపడ్డాడు.

పెదనలో ఈ సంబరాలు పదకొండు రోజులు జరుగుతాయి. ఈ పదకొండు రోజులూ- కోళ్ళు, యాటపోతులూ, బలులూ, నైవేద్యాలూ, భజనలూ, పిడి బొమ్మల ఊరేగింపులూ జరుగుతాయి. ముఖ్యంగా తొమ్మిదో రోజూ, పదకొండో రోజూ చుట్టుపక్కల గ్రామాల నుంచి జనం విపరీతంగా వస్తారు!

పదకొండో రోజు అంటే చివరరోజు రంగడికి సుభద్ర ఐదు రూపాయిలిచ్చి సంబరాలకు పంపింది.

మధ్యాహ్నం రెండు గంటలు దాటిన తర్వాత రంగడు ఎన్నడూ లేనంత అందంగా తయారయి నాలుగుమైళ్ళ దూరంలో జరుగుతున్న సంబరాలకు బయలుదేరాడు.

నిక్కరు జేబులో దాచుకున్న ఐదు రూపాయలు ఎక్కడ పోతాయోనని జేబులో చెయ్యి పెట్టుకుని మరీ నడవసాగాడు.

దారి పొడుగునా భజనలూ, మైకులూ, కేకలూ జనాన్ని చూస్తుంటే రంగడికి ఎక్కడలేని సంతోషం వేసింది.

త్వరగా అద్దం కొనుక్కొని, ఆ అద్దంలో తన ముఖం చూసుకోవాలనే ఆరాటం ఎక్కువ కావటంతో రంగడికి పరిసరాల్లో ఏం జరుగుతోందో చూడాలనే ధ్యాసకూడా లేదు!

ప్రతి కొట్టులోనూ జనం విపరీతంగా వున్నారు. కొట్టులో ఏఏ సామానుందో కూడా రంగడు చూడలేకపోయాడు.

జనాన్ని తోసుకుని వెళ్ళి "అద్దం" కొనుక్కోవాలనుకున్నాడు.

రంగడ్ని అవతలకు తోసేశారు.

రంగడి మాట ఎవరూ వినిపించుకోలేదు!

ఈ హడావుడిలో, సందడిలో రంగడికి ఒక్కసారిగా గుండె ఆగినంతపనయింది

జేబులో ఐదు రూపాయలనోటు కనిపించలేదు! కంగారు పడిపోయాడు. వళ్ళంతా చెమట్లు పోశాయి. చేతులు వణకసాగాయి. అవును. ఇప్పుడేం చెయ్యాలి?

మళ్ళీ జేబులో చెయ్యిపెట్టి చూశాడు. అరే? ఇదేవిటి? జేబులో ఐదు రూపాయిలున్నాయే. ఎలా వచ్చింది? ఇందాక కుడి జేబులోంచి ఎడం చేతివైపు జేబులోకి ఆ నోటును మార్చుకున్నాడు.

అతి కష్టంమీద జనాన్ని తోసుకుని ఒక దుకాణంలోకి వెళ్ళాడు. ఆ దుకాణదారుడు ఎంత పిలిచినా రంగడి మాట వినిపించుకోవడంలేదు. ఆడవాళ్ళ బేరంతోనే అతగాడికి సరిపోతోంది.

పిలవగా పిలవగా చివరకు తలెత్తి "ఏం కావాలి?" అని అడిగాడు.

"అదిగో! అక్కడ....ఆ కనిపించే అద్దం ఎంత?" అని అడిగాడు.

"ఇదా! ఏడు రూపాయలు."

"ఏడు రూపాయలా?" ఆపైన రంగడు మాట్లాడలేక ఇవతల కొచ్చేసి మరో దుకాణంలోకి వెళ్ళాడు.

అక్కడకూడా రంగడికి నిరాశే ఎదురయింది!

ఏం చెయ్యాలో? అద్దం ఎలా కొనాలో తెలియక రంగడు తల్లడిల్లిపోయాడు.

ఏడుపొచ్చేంత పనైంది.

తన కోరిక ఇక నెరవేరదా?

తను అద్దం కొనుక్కోలేడా?

రంగడికి విపరీతమైన దాహంగావుంది. ఆకలిగాకూడా వుంది.

పది పైసలు పెట్టి షోడా తాగుదామనుకున్నాడు కానీ, తాగలేదు! అద్దానికి డబ్బులు తక్కువైతే?

సరిగ్గా అదే సమయంలో—ఎవరో అద్దం కొనుక్కెడుతూ రంగడికి కనిపించారు. రంగడు గబగబా ఆ వ్యక్తి దగ్గరకు వెళ్ళి "ఈ అద్దం ఎంత క్కొన్నారండీ" అన్నాడు.

"ఐదు రూపాయలు."

"ఐదు రూపాయలా! ఎక్కడ?" రంగడు చాలా ఆదుర్దాగా అడిగాడు.

"అదిగో అక్కడ బల్లమీద పెట్టుకుని అమ్ముతున్నాడు" ఆ వ్యక్తి చేత్తో చూపించి వెళ్ళిపోయాడు.

ఒక గొప్ప అద్భుతాన్ని కనుగొన్నట్టు రంగడు వడివడిగా అక్కడి కెళ్ళాడు.

ఎలాగైతేనేం ఐదు రూపాయలకు అద్దాన్ని కొనుక్కున్నాడు. ఆ అద్దాన్ని చేతిలోకి తీసుకుంటుంటే రంగడి శరీరం కంపించిపోయింది. ఇదీ అని చెప్పలేని ఆనందాన్ని అనుభవించాడు.

అప్పటికి చీకటిపడిపోతోంది. పొరుగూరుజనం ఇళ్ళకు తిరిగి వెళ్ళిపోతున్నారు. దాదాపు అందరి చేతుల్లోనూచెరకు గెడలో, లేదా ఏదో ఒక వస్తువో వున్నది.

రంగడు ఆ అద్దాన్ని గట్టిగా పట్టుకుని వడివడిగా నడుస్తున్నాడు. తనకిరుప్రక్కలా, ముందూ, వెనుకా ఎవరెవరు నడుస్తున్నారో కూడా గమనించటం లేదు.

తొందర తొందరగా నడుస్తున్నాడు.

అప్పుడే ఆ క్షణంలోనే పెద్ద గుంపొకటి ఎదురుగా వస్తోంది!

వాళ్ళంతా తాగి వున్నారు. బొమ్మల్ని ఆడించుకుంటూ, డప్పులు వాయిస్తూ, పూనకం వచ్చిన గణాచారుల్లా వూగిపోతున్నారు.

రంగడు వాళ్ళను తప్పుకుని నడుద్దామనుకునేంతలోనే వాళ్ళు వచ్చి రంగడి మీద పడిపోయారు.

రంగడు ఎటూ కదల్లేక ఒక్కసారిగా వాళ్ళంతా మీద పడడంవల్ల క్రింద పడిపోయాడు. చేతిలోవున్న అద్దం ఎటో పడిపోయింది.

గుంపు వెళ్ళిపోయిన తర్వాత రంగడు లేచి బట్టలు దులుపుకుని, అద్దంకోసం చూశాడు. కానీ, ఆ అద్దం ఎక్కడా కనిపించలేదు!

కనిపించని ఆ అద్దంకోసం రంగడు ఆ ప్రదేశమంతా వెదుకుతూనే వున్నాడు.

సరిగ్గా అప్పుడే పశ్చిమదిశలో ఆకాశం ఎర్రగా మండుతోంది! రంగడు ఆ అద్దం కోసం యింకా వెదుకుతూనే వున్నాడు. ఆ వీధిలో ఆదుమ్ములో, ధూళిలోకనపడని తల్లిలాటి ఆ కనపడనిఅద్దంకోసంరంగడు యింకా వెతుకుతూనే వున్నాడు. ●


జయశ్రీలో జయం తథ్యం

# జయశ్రీ బి. ఇడి కాలేజి

(అన్నామలై యూనివర్శిటీ కరస్పాండెన్స్ కోర్సు కోచింగ్ మరియు గైడెన్స్ ఇన్‌స్టిట్యూట్)

## జయశ్రీ ట్యుటోరియల్ కాలేజి (స్థా : 1969)

15/639, కమలా నగర్, అనంతపురం-515 001.

ప్రభుత్వ యాజమాన్యం క్రింద నిర్వహింపబడు బి.ఇడి. కాలేజిలలో సీట్లు దొరకని వారికిని, ప్రవేట్ బి.ఇడి; కాలేజిలలో సీట్లకు వేలకొలది రూపాయలు దొడ్డిదారిన డొనేషన్లు లేదా క్యాపిటేషన్ ఫీజులు యిచ్చుకోలేని వారికిని, అతి స్వల్పమైన ఖర్చుతో "ప్రవేట్ స్టడీ" ద్వారా ఒకే విద్యాసంవత్సరములో బి.ఇడి; డిగ్రీ సంపాదించుటకు ఇది సువర్ణావకాశం. అడ్మిషన్ ముగింపు : 27–6–81.

(1) అర్హులు : జూనియర్ లెక్చరర్లు, టీచర్లు, పోస్టు గ్రాడ్యుయేట్లు, గ్రాడ్యుయేట్లు. (2) కోచింగ్ : పోస్టల్ / ఓరల్. (3) శిక్షణ యివ్వబడు తరగతులు : బి.ఇడి; ఎం.ఇడి: ఎం. ఎ; బి. ఎ; బి.కాం; (ఎంట్రెన్స్ మరియు డిగ్రీ ఎగ్జామ్స్) ఇంటర్ & యస్.యస్.సి.

గమనిక : వివరములకుగాను ప్రాస్పెక్టస్‌కు రు. 3/– ఎం. ఓ. పంపండి.

యస్. విశాలాక్షి జయరామరెడ్డి,
కరస్పాండెంట్.